ప్రజాశక్తి

మంగళవారం ఏప్రిల్ 9 2024 8 పేజీలు

శ్రీకాకుళం





నీటిఎద్దడి నివారణకు తక్షణ చర్యలు

3లో



4లో

షడ్రుచుల ఉగాది..

తెలుగు సంవత్సరాది



విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

- పనిచేస్తున్న కేంద్రాన్ని విడిచి వెళ్లవద్దు
- ఫిర్యాదు వచ్చిన వెంటనే చర్యలు
- కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

వార్త 3లో

ఊసే లేని అభివృద్ధి ఎజెండా

ఉచితాలే అజెండా



- ప్రజా సమస్యలపై మాట్లాడని ప్రధాన పార్టీలు
- వంశధార, ఆఫ్‌షోర్ ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి
- జీడికి మద్దతు ధరను ప్రస్తావించని అభ్యర్థులు
- గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలనూ నెరవేర్చని వైనం
- సంక్షేమ పథకాల చుట్టే ప్రచారమంతా...

3లో

వైసిపి అభ్యర్థులు ఇంటింటా ప్రచారం


చెక్కును అందజేస్తున్న ఎస్‌పి రాధిక

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

శ్రీకాకుళం: ఇటీవల అనారోగ్య సమస్యలతో మరణించిన హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ కుటుంబాలకు అండగా ఉంటామని జిల్లా ఎస్‌పి జి.ఆర్.రాధిక అన్నారు. అనారోగ్య సమస్యలతో మరణించిన కొత్తూరు పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సవర అనప, గార పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ బూర సురేష్ కుటుంబాలకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో శాఖాపరంగా మంజూరు చేసిన రూ.75వేలు చెక్కును అనప సతీమణి లక్ష్మి, సురేష్ సతీమణి పద్మావతిలకు ఎస్‌పి చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ సిబ్బంది మరణం చాల బాధాకరమని, జిల్లా పోలీసు శాఖకు తీరని లోటని, ఏ సమస్య ఉన్నా నేరుగా వచ్చి ధైర్యంగా తెలియజేయవచ్చని, శాఖా పరంగా మిగిలిన ప్రయోజనాలను త్వరితగతిన అందేలా చూస్తామని ఎస్‌పి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి డా.జి.ప్రేమ్ కాజల్, ఎఆర్ డిఎస్‌పి ఎల్ శేషాద్రినాయుడు, పరిపాలన అధికారి సిహెచ్ గోపీనాథ్ ఉన్నారు.



దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

బాలలను పనిలో పెట్టుకోవడం నేరం

పొందూరు: 18 ఏళ్లలోపు బాల బాలికలను పనిలో పెట్టుకోవడం నేరమని సీనియర్ సివిల్‌జడ్జి ఆర్.సన్యాసి నాయుడు అన్నారు. మండలం రాపాక కూడలిలో సోమవారం ఆపరేషన్ స్వేచ్ఛ-2లో భాగంగా బాండెడ్ లేబర్, చైల్డ్ లేబర్ రెస్క్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు దుకాణాలను తనిఖీ చేసి బాల బాలికలను పనిలో పెట్టుకుంటే అటువంటి యజమానులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా బాలల రక్షణ విభాగం అధికారి కె.వి.రమణ, ఎఎస్‌ఐ సువ్వారి రామచంద్రరావు, అసిస్టెంట్ లేబర్ అధికారి ఆర్.వి.శ్రీనివాసరావు, బి.కొండల రావు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్‌కు చెందిన బి.హరిప్రసాద్, యం.ఆఫీజా, డిసిపియు యూనిట్‌కు చెందిన శ్రీనివాసరావు, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది డి.మౌనిక, ఎస్.వైకుంఠరావు, బ్రెడ్స్ సంస్థ సభ్యులు గణపతిరావు పాల్గొన్నారు.

వికలాంగ పింఛను మంజూరు చేయాలని స్పీకర్‌కు మొర


ఆమదాలవలస : తమ్మినేని వద్ద మొరపెట్టుకుంటున్న యశోద

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని మూల సవలాపురంకు చెందిన శబరి కులానికి చెందిన మహిళ గొల్లపల్లి యశోద తన బిడ్డకు వికలాంగుల పింఛను మంజూరు చేయాలని స్పీకర్ తమ్మినేని సీతారాం వద్ద మొరపెట్టుకుంది. సోమవారం సరుబుజ్జిలి మండలం మూల సవలాపురం పంచాయతీలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామానికి చెందిన శబరి కులస్తులు గొల్లపల్లి యశోద, గణేష్ దంపతులకు ఇద్దరు కుమారులు పోలియో వ్యాధిగ్రస్తులు ఉన్నారు. ప్రచారానికి వచ్చిన సీతారాం వద్దకు తల్లి యశోద వికలాంగ కుమారుడైన భరత్‌ను తీసుకువచ్చి ఐదేళ్లగా వికలాంగుల పింఛను అర్జీలు ఇచ్చినప్పటికీ అధికారులు స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేసింది. పోలియో వ్యాధితో 10 ఏళ్ల గౌతమ్, 8 సంవత్సరాల భరత్ పూర్తి అంగవైకల్యంగా మారి మంచాన పడ్డారని స్పీకర్ దృష్టికి తీసుకువెళ్లింది. ఇద్దరు దివ్యాంగ కుమారులకు నెలవారి వైద్య ఖర్చులకు డబ్బులు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని, ఇద్దరు కుమారులకు దివ్యాంగ పింఛను మంజూరు చేసి ఆదుకోవాలని స్పీకర్‌కు మొరపెట్టుకుంది. దీనిపై స్పందించిన సభాపతి అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని ఆమెకు హామీ ఇచ్చారు. అలాగే ఆమదాలవలస మండలంలోని బెలమాం పంచాయతీలో స్పీకర్ ఇంటింటా ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు కెవిజి సత్యనారాయణ, సురవరపు నాగేశ్వరరావు, పేడాడ చిరంజీవిరావు, బెవర మల్లేశ్వరరావు, జీవి శివానంద్ మూర్తి, మూడడ్ల రమణ పాల్గొన్నారు.

పలాస: పలాస నియోజకవర్గంలో గౌతు కుటుంబం 60 ఏళ్లలో చేసిన అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్ హయాంలో 60 నెలలో తాను చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమని పశు సంవర్థకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సవాల్ విసిరారు. మండలంలోని మామిడిపల్లి, బొడ్డపాడు, మావిగుడిమెటు, మాకన్నపల్లి, గొల్లమాకన్నపల్లి, నీలావతి, రంగోయి పంచాయతీల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డ్వాక్రా రుణాలకు వడ్డీ, చేయూత, అసరా, అమ్మఒడి వంటి ఎన్నో పథకాలు పెట్టి ప్రజలకు మేలు చేశామన్నారు.కిడ్నీ రీసెర్చ్ సెంటర్, వైఎస్ఆర్ సుజలధార జగన్ మన ప్రాంతానికి ఇచ్చిన వరమని అన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను, ఎంపిగా పేడాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ఉంగసాయి, పిఎసిఎస్ అధ్యక్షులు పైల చిట్టి. మూర్తి, దువ్వాడ రవి, సర్పంచ్‌లు తామాడ మధన్, సైన దేశయ్య, సొర్ర తిరుపతిరావు, ఎంపిటిసిలు మద్దిల పాపారావు, కోరాడ నిరూప, ఉప్పరపల్లి ఉదయకుమార్, బొడ్డు సుధాకర్ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: వైసిపితోనే రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఉదయం తలగాం, మధ్యాహ్నం పట్టణంలోని చిన్నబ్రాహ్మణ వీధి, పెద్దబ్రాహ్మణ వీధి మండ పొలం కాలనీలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలలో వైస్ ఎంపిపి పేడాడ రమేష్, సర్పంచ్ గొండెలి సుజాత, హనుమంతు వెంకటేశ్వరరావు, ఎంపిటిసిలు కూన పార్వతి, పీత హేమలత, వాకాడ శ్రీధర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కిల్లి అజయ్, జెసిఎస్


పలాస : ప్రచారం చేస్తున్న మంత్రి అప్పలరాజు


టెక్కలి రూరల్ : ప్రచారం చేస్తున్న శ్రీనివాస్

కన్వీనర్ సిగిలిపల్లి మోహనరావు, పిఎసిఎస్ అధ్యక్షుడు సత్తార్ సత్యం, టెక్కలి టౌన్ అధ్యక్షుడు తమ్మన్నగారి కిరణ్ కుమార్, చంటి పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: రెవిన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు తనయుడు రామమనోహర నాయుడు గార మండలం కె.మత్స్యలేశంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మండేటి కృష్ణ, గొండు రఘురాం, జయరాం, కృష్ణ, పీస శ్రీహరి పాల్గొన్నారు.

బూర్జ: మండలంలోని చినలంకాంలో రాష్ట్ర యువజన నాయకులు తమ్మినేని చిరంజీవి నాగ్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, టిట్కో డైరెక్టర్ కె.గోవిందరావు, జెడ్‌పిటిసి రామారావు, వైస్ ఎంపిపిలు సూర్యారావు, కరణం కృష్ణం నాయుడు, సర్పంచ్ గోవిందరావు, ఎంపిపి కె.నాగేశ్వరరావు, ఎంపిటిసి గుమ్మడి రాంబాబు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

త్రివన్ లోగో ఆవిష్కరణ

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయ ప్రాంగణం తెలుగుశాఖ, త్రివన్ క్లబ్ ఆధ్వర్యంలో త్రివన్ లోగోను డైరెక్టర్ ఆచార్య బాలాజీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఒఎస్‌డి సుధాకర్ బాబు మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో మాతృభాషా సాహిత్యాలపై సాంకేతిక విశ్వవిద్యాలయాల్లో మక్కువ పెంచాలన్నారు. ఎఒ ముని రామకృష్ణ మాట్లాడుతూ తెలుగులో మన భావాన్ని చక్కగా వ్యక్తం చేయగలమని, మిగిలిన భాషల్లో సులభంగా మాట్లాడవచ్చునన్నారు. త్రివన్ అనగా తెలుగు భాషపై మమకారంతో పాటు వనరులపై ఆన్‌లైన్ మ్యాగజైన్ తీసుకొచ్చే విధంగా ప్రయత్నం చేస్తామన్నారు. పిల్లల్లో భాషా సాహిత్యాలపై మక్కువతో కవితలు, కథలు, వ్యాసాలు, ఆధ్యాత్మిక పుస్తకాలు, నవలలు తదితర అంశాలపై అవగాహన కలిగించేందుకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో డీన్ మోహన్ కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ అసిరినాయుడు, వెల్ఫేర్ డీన్ గేదెల రవి, తెలుగుశాఖ అధ్యక్షులు డా.జి.ప్రకాశరావు, అధ్యాపకులు డా.పెద్దింటి ముకుందరావు, డా.పలివెల చిరంజీవిరావు, డా.మహేశ్వరి, డాక్టర్ శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.


లోగోను ఆవిష్కరిస్తున్న బాలాజీ

ఉత్తమ కవులకు ఉగాది బహుమతులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణానికి చెందిన ఉత్తమ కవులకు మన మాతృభాష సామాజిక అంతర్జాల మాసపత్రిక క్రోధి నామ ఉగాది సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి కవితల పోటీల్లో ముగ్గురు కవులు కె.వి.రాజారావు(వచన కవిత్వం), కర్నేన జనార్ధనరావు (పద్య కవిత్వం), కుప్పిలి చంద్రమౌళి (పద్యకవిత్వం)లో బహుమతులు పొందినట్టు హైదరాబాద్‌కు చెందిన సాహిత్య సంస్థ అధ్యక్షులు లింకశ్రీ సమాచారం పంపినట్టు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 371 మంది ఈ పోటీల్లో పాల్గొనగా ఉత్తమ కవులుగా ఎంపిక కాబడిన 40 మందిలో శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసకు చెందిన ముగ్గురు కవులు పురస్కారాలు పొందడం విశేషం. ఈ ముగ్గురికీ ఆన్‌లైన్‌లో ప్రశంసాపత్రం, జ్ఞాపిక, కవితా సంకలనం, పుస్తకం, రూ.116 నగదును పంపనున్నట్లు నిర్వాహకులు తెలియజేసినట్లు తెలిపారు. పట్టణానికి చెందిన కవులకు అరుదైన గౌరవం దక్కినందుకు తోటి రచయితలు, సాహిత్య ప్రియులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తొలగించిన జెండా

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

జి.సిగడాం : ప్రజాశక్తిలో సోమవారం వెలువడిన అధికారుల నిర్లక్ష్యం అనే వార్తకు వెంటనే అధికారులు స్పందించారు. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా గేదలపేట జంక్షన్ వద్ద స్తంభానికి వేలాడుతున్న టిడిపి జెండాను సోమవారం సెక్టార్ అధికారి లంక అన్నా శామ్యూల్ ఆధ్వర్యంలో బిఎల్ఒ బూర ఎలకయ్య స్తంభానికి వేలాడుతున్న జెండాను తొలగించారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి వైదేహిని వద్ద ప్రస్తావించగా ఎన్నికల కోడ్ వచ్చిన వెంటనే జెండాలను తొలగించామని, ఈ మధ్య కాలంలోనే మళ్లీ ఎవరో పెట్టారన్నారు.


జెండాను తొలగిస్తున్న విఆర్‌ఒ ఎలకయ్య

కనుగులవలసలో కార్డాన్‌సెర్చ్


చిస్వాధీనం చేసుకున్న వాహనాలతో సిఐ, సిబ్బంది

ఆమదాలవలస: ద్విచక్ర వాహనాలపై ప్రతిఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సిఐ జి.వాయునందన్ దివాకర్ యాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని కనుగులవలసలో కార్డాన్ సెర్చ్ నిర్వహించారు. తెల్లవారు జామునే గ్రామానికి చేరుకుని క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఎటువంటి పత్రాలు లేని ఐదు ద్విచక్ర వాహనాలను గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు అన్ని రకాల పత్రాలు సరిచూసుకొని రోడ్డుపైకి రావాలని, అలాగే ద్విచక్ర వాహనాల క్రయవిక్రయాల్లో పత్రాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. బైక్ దొంగతనాలు చేసే వ్యక్తుల నుంచి ఎటువంటి వాహనాలు కొనుగోలు చేపట్టకూడదని ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు తారసపడితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఎస్ఐ కె.వెంకటేష్, ఆర్‌పిఎఫ్ ఎస్ఐ దీపక్ మిశ్రా, ఎఎస్ఐ లక్ష్మి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

ప్రజాశక్తి- ఆమదాలవలస

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటే మన ఆయుధం..చేజార్చుకోకు వచ్చిన అవకాశం అన్న నినాదంతో ఎపిఎం పైడి కూర్మారావు ఆధ్వర్యంలో మహిళా సంఘాలతో ర్యాలీ నిర్వహిం చారు. సోమవారం మండలంలోని కొర్లకోట, చింతలపేట, నెల్లిపర్తిలో ర్యాలీ నిర్వహించి ఓటుపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. 18 ఏళ్ళ పైబడిన వయోజనులందరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. వెలుగు క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, విఒఎలు, గ్రామ సంఘం లీడర్లు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



చింతలపేటలో ఓటు ప్రాముఖ్యతపై ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

కిడ్నీ రోగికి ఆర్థికసాయం

లావేరు: మండలం వెంకటాపురంకు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన నెల్లి అప్పన్నకు సహాయం చేస్తున్న హృదయాలు ఫౌండేషన్ సోమవారం వైద్య ఖర్చుల నిమిత్తం రూ.12 వేలు ఆర్థికసాయాన్ని అందించారు. అప్పన్న గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో ఇబ్బంది పడుతూ ఇటీవల డయాలసిస్ కోసం ఆస్పత్రికి ఆటోలో ప్రయాణిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడటంతో ప్రమాదంలో కాలుకు తీవ్ర గాయపడటంతో వైద్య ఖర్చులకు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న సహాయం చేస్తున్న హృదయాలు ఫౌండేషన్ సభ్యులు అప్పలరాజు ఆధ్వర్యంలో ఆర్థికసాయం చేశారు.


అప్పన్నకు ఆర్థికసాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఊసే లేని అభివృద్ధి జెండా

వైసిపి, ఎన్‌డిఎ కూటమి అభ్యర్థుల ప్రకటన జిల్లాలో పూర్తి కావడంతో, అంతా ప్రచారంపైనే దృష్టిసారించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకుని ఎన్నికల్లో తమకే ఓటు వేయాలంటూ అభ్యర్థిస్తున్నారు. ర్యాలీలు, కూడళ్లలో బహిరంగ సభలు నిర్వహిస్తూ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రధాన రాజకీయ పార్టీలైన వైసిపి, టిడిపి దుమ్మెత్తిపోసుకుంటున్నాయి. తమ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలపై వైసిపి... అధికారంలోకి వస్తే ఏ పథకాలు అమలు చేయబోతామో టిడిపి తెగ ప్రచారం చేసుకుంటున్నాయి. గెలిస్తే నియోజకవర్గానికి ఏం వెలగబెడతామో, ఏ రకమైన అభివృద్ధి చేస్తామో, నియోజకవర్గంలో ఉన్న సమస్యల పరిస్థితి ఏమిటన్నది మాత్రం పట్టడం లేదు. దీంతో అభివృద్ధి జెండా పక్కకుపోయి ఉచితాలే అజెండాగా ప్రచారం సాగుతోంది.



హిరమండలం వద్ద అసంపూర్తిగా వంశధార రిజర్వాయర్ నిర్మాణం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో వంశధార ఫేజ్-2 స్టేజ్-2 ప్రధానమైన సాగునీటి వనరుగా ఉంది. టిడిపి, వైసిపి ప్రభుత్వాలు ఐదేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్నా, ప్రాజెక్టు మాత్రం పదేళ్లుగా అసంపూర్తిగానే ఉంది. ఇదిగో అదిగో నీళ్లిస్తామంటూ మంత్రులు, ఎమ్మెల్యేలు రైతుల చెవుల్లో పువ్వులు పెడుతూనే ఉన్నారు. ఈ ప్రాజెక్టు అంశం పాతపట్నం, నరసన్నపేట, టెక్కలి, పలాస, ఆమదాలవలస, శ్రీకాకుళం నియోజకవర్గాలతో ముడిపడి ఉంది. ప్రస్తుతం పోటీ చేస్తున్న వైసిపి, టిడిపి అభ్యర్థులెవరూ దీనిపై కనీసం మాట్లాడడం లేదు. ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేకపోయామో వైసిపి, తాము వస్తే ఎప్పట్లోగా పూర్తి చేస్తామో టిడిపి ప్రజాప్రతినిధులు చెప్పలేకపోతున్నారు. అటు ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పరిస్థితి అలానే ఉంది. ఆఫ్‌షోర్ పూర్తయితే టెక్కలి, పలాస నియోజకవర్గాల్లోని పలు గ్రామాలకు తాగునీరు, రైతులకు సాగునీరు అందే అవకాశముంది. పదేళ్లు ఇరు పార్టీల నాయకులు పదవులు వెలగబెట్టినా, నేటికీ అక్కడ 45 శాతం పనులే పూర్తయ్యాయి. గతంలో మంత్రిగా పనిచేసిన టిడిపి రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, ప్రస్తుత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న పశు సంవర్థకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు సకాలంలో పనులు చేయించడంలో విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

జీడి మద్దతుపై మాట్లాడని ప్రధాన పార్టీలు

జిల్లాలో ప్రభుత్వపరంగా జీడి పంట కొనుగోలు లేకపోవడంతో రైతులకు మద్దతు ధర దక్కడం లేదు. పంట చేతికి రానంత వరకు మంచి ధర పలుకుతున్నా వ్యాపారులు, దళారులు సిండికేట్‌గా మారి తక్కువ ధరకే కొనుగోలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. జీడి పప్పుకు ధర పలుకుతున్నా, పిక్కలకు మాత్రం రేటు గిట్టుబాటు కావడం లేదు. 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించడంతో పాటు రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని రైతులు పలురూపాల్లో ఆందోళనలు చేశారు. రైతుల తరుపున మాట్లాడాల్సిన మంత్రి అప్పలరాజు వ్యాపారులకు మేలు చేసేలా వ్యవహరించారన్న విమర్శలను మూటగట్టుకున్నారు. ఇదిగో అదిగో కొంటామంటూ కాలయాపన చేశారు. జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సైతం దీనిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీనిచ్చినా, అది నేటికీ నెరవేరలేదు. టిడిపి ఒకసారి ఆందోళన చేసినా, ఆ తర్వాత ఆ అంశం జోలికే పోలేదు. ప్రచారంలో దీనిపై ఏం చెప్తారోనని రైతులు ఎదురుచూస్తున్నారు.

షటర్ల సమస్యపై చేతులెత్తేశారు

వంశధార శివారు భూములకు షట్టర్ల కుంభకోణం కేసు అడ్డంకిగా మారింది. షట్టర్ల కొనుగోళ్లలో అవినీతిపై 2009లో సిఐడి కేసు నమోదు చేసింది. దీనిపై నేటికీ హైకోర్టులో విచారణ సాగుతోంది. 14 ఏళ్లు అవుతున్నా, నేటికీ విచారణ ఒక కొలిక్కి రాలేదు. విచారణ పెండింగ్‌లో ఉండడంతో కాలువలపై కొత్త షట్టర్లను ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు సీజ్ చేసిన షట్టర్లు తుప్పు పట్టిపోవడంతో కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది. సాగునీటి సలహా మండలి, జిల్లా సమీక్షా కమిటీ సమావేశాలు తదితర సందర్భాల్లో జలవనరులశాఖ అధికారులు పలు పర్యాయాలు ప్రస్తావిస్తున్నా, ప్రభుత్వం నుంచి స్పందన కనిపించడం లేదు. సిఎం జోక్యం చేసుకుంటే గానీ సమస్య పరిష్కారం కాదు. గతంలో టిడిపి, ప్రస్తుత వైసిపి ప్రజాప్రతినిధులు ఆ పని చేయలేకపోయారు.

నియోజకవర్గాల్లో దీర్ఘకాలిక సమస్యలు ఎన్నో...

జిల్లాలో ఇతర నియోజకవర్గాల్లోనూ అనేక సమస్యలు ఉన్నాయి. శ్రీకాకుళం నియోజకవర్గంలో పునర్నిర్మాణం చేపడతామని కోడి రామ్మూర్తి స్టేడియాన్ని కూల్చేశారు. నేటికీ పూర్తి చేయలేదు. శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డు విస్తరణ పనులను అర్ధాంతరంగా ఆపేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ రోడ్డుపై ప్రమాదాలు సంభవించి మృత్యువాత పడుతున్నారు. ఇచ్ఛాపురం మున్సిపాల్టీలోని ఒకటి, రెండు వార్డుల్లో ఏళ్ల తరబడి మంచినీటి సమస్య ఉన్నా ఏ ఒక్కరూ పరిష్కరించడం లేదు. బాహుదా ఛానల్ మరమ్మతులకూ రెండు ప్రభుత్వాలు నిధులు కేటాయించలేదు. నరసన్నపేట నియోజకవర్గంలో పోలాకి మండలం వనిత మండలం నుంచి గార వరకు ప్రతిపాదించిన వంతెన పదేళ్లుగా పెండింగ్‌లో ఉంది. ఎచ్చెర్ల నియోజకవర్గంలో తోటపల్లి కొత్త ఆయకట్టు కాలువ తవ్వకాలు, మడ్డువలస రిజర్వాయర్ పనులు పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. దీనిపై వైసిపి, టిడిపి అభ్యర్థులు ఎవరూ మాట్లాడని పరిస్థితి నెలకొంది. ప్రచారానికి వస్తున్న అభ్యర్థులను వీటిపై ప్రజలే ప్రశ్నించాల్సి ఉంది.



నీటిఎద్దడి నివారణకు తక్షణ చర్యలు

కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నీటి ఎద్దడి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, ఉపాధి హామీ, వేసవిలో విద్యుత్ సరఫరా తదితర అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్ జవహర్ రెడ్డి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీటి కొరత లేకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

నీటి ఎద్దడికి సంబంధించి ఎటువంటి సమస్యలు ఉత్పన్నమైనా కంట్రోల్‌రూమ్ ఫోన్ నంబర్లు **ఆర్‌డబ్ల్యుఎస్ : 9100120602, డ్వామా : 6309900660, ఎపిఇపిడిసిఎల్ : 9490612633** ఫోన్ చేసి సమాచారం అందిస్తే సత్వర చర్యలు చేపడతామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ జాన్ బెన్వర్, ఇరిగేషన్ ఎస్ఇ డోల తిరుమలరావు, వంశధార ఎస్ఇ సుధాకర్, డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు, ఇపిడిసిఎల్ ఎస్ఇ నాగిరెడ్డి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'పది' మూల్యాంకనం పూర్తి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో పదో తరగతి పరీక్షల మూల్యాంకనం సోమవారంతో పూర్తయింది. జిల్లాకు కేటాయించిన 1,98,449 జవాబు పత్రాలను వారం రోజుల పాటు దిద్దుబాటు కొనసాగింది. మూడు కేంద్రాల్లో నిర్వహించిన మూల్యాంకనంలో 1075 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వారిలో 120 మంది చీఫ్ ఎగ్జామినర్లు కాగా, 705 మంది సహాయక ఎగ్జామినర్లు, 250 మంది స్పెషల్ సహాయకులుగా వ్యవహరించారు. 23 రకాల పేపరు సెట్లకు చెందిన 1,98,449 జవాబు పత్రాలను డీ కోడింగ్ చేసి ఎస్-ఎస్‌సి బోర్డు అధికారులు జిల్లాకు పంపించారు. వాటి మూల్యాంకనం ముగిసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు తెలిపారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

- పనిచేస్తున్న కేంద్రాన్ని విడిచి వెళ్లవద్దు
- ఫిర్యాదు వచ్చిన వెంటనే చర్యలు
- కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదని, ఫిర్యాదు వచ్చిన వెంటనే 24 గంటల్లో దాని పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ స్పష్టం చేశారు. సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై ఆర్‌ఒలు, ఎఆర్‌ఒలు, నోడల్ అధికారులతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి తహశీల్దార్లు, ఎన్నికల సిబ్బంది వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది ముందస్తు అనుమతులు లేకుండా వారు పనిచేస్తున్న కేంద్రాన్ని విడిచి వెళ్లరాదని స్పష్టం చేశారు. ఫిర్యాదు వచ్చిన 24 గంటల్లో పరిష్కారం చూపాలని ఆదేశించారు. నిబంధనలు మీరిన అధికారులపై వేటు తప్పదని హెచ్చరించారు.

చెక్‌పోస్టుల్లో వెబ్‌కాస్టింగ్

పోలింగ్, కౌంటింగ్‌కి సంబంధించి నిర్దేశించిన ఏర్పాట్లు పూర్తిస్థాయిలో ఉన్నాయో లేదో ముందుగా చూసుకోవాలని సూచించారు. ఎక్కడ ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది వారికి అప్పగించిన బాధ్యతలను అప్రమత్తంగా నిర్వహించాలన్నారు. 48 గంటలు దాటినా కొన్ని శాఖలు రోజువారీ ఎన్నికల నివేదికలు అందజేయడం లేదన్నారు. 13వ తేదీలోగా పోస్టల్ బ్యాలెట్ ప్రతిపాదనలు పంపాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఇంకా 18 రకాల స్టేషనరీ ఎన్నికల సంఘం నుంచి రావాల్సి ఉందని, వాటిని త్వరగా తెప్పించాలని సంబంధిత నోడల్ అధికారిని ఆదేశించారు. పోలింగ్ రోజున 450 వాహనాలు సిద్ధం చేయాలని, అవి కాకుండా అదనంగా 104 టాటా మ్యాజిక్ వాహనాలు సిద్ధం చేయాలని రవాణా నోడల్ అధికారికి సూచించారు. అన్ని చెక్‌పోస్టుల్లో వెబ్ కాస్టింగ్ కచ్చితంగా ఉండాలని స్పష్టం చేశారు.

3 గంటల వరకే నామినేషన్ల స్వీకరణ

నామినేషన్ల స్వీకరణ సమయం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకేనని, మొత్తం ప్రక్రియను వీడియోగ్రఫీ చేయాలన్నారు. డిఎస్‌పి స్థాయి అధికారి బందోబస్తు నిర్వహించాలని చెప్పారు. పోలింగ్, ఆ ముందు రోజు చేయాల్సిన పనులను చెక్‌లిస్టు తయారు చేసుకుని విధులు నిర్వహించాలన్నారు. ప్రతి పిఒ తీసుకోవాల్సిన మెటీరియల్, ఇవిఎంల నిర్వహణ, ఓటరు జాబితా మార్క్ కాపీ, పిఒ, ఎపిఒ డైరీ, వారి విధులు, మాక్ పోల్, ఇవిఎం, వివి ప్యాట్లను ఎలా అనుసంధానం చేయాలి వంటి విషయాలు ఒకటికి రెండుసార్లు చూసుకోవాలని చెప్పారు. పోలింగ్ రోజున ప్రతి రెండు గంటలకు ఇచ్చే పోలింగ్ శాతం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారంలో రాష్ట్రంలోనే ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎపిఎంఐపి పీడీ శ్రీనివాసరావును అభినందించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, రిటర్నింగ్ అధికారులు నూరుల్ కమర్, భరత్ నాయక్, సిహెచ్.రంగయ్య, లక్ష్మణమూర్తి, రామ్మోహన్, సుదర్శన్‌దొర, అప్పారావు, ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, సిపిఒ ప్రసన్నలక్ష్మి, ఎల్‌డిఎం సూర్యకిరణ్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

షడ్రుచుల ఉగాది.. తెలుగు సంవత్సరాది

నేటి నుంచి శ్రీ క్రోధి నామ సంవత్సరం

ప్రజాశక్తి - శ్రీకాకుళం కల్చరల్

ఉగాది పూర్తిగా వ్యవసాయాధారమైన పండగ. తెలుగు వారి కొత్త సంవత్సరం ఆరంభ దినాన్నే ఉగాది (యుగ ఆది అంటే యుగానికి ఆది) అని పిలుస్తారు. చైత్రశుద్ధ పాఢ్యమి నాడు తెలుగువారు, కన్నడిగులకు, మరాఠీలకు కొత్త సంవత్సరం ప్రారంభ మౌతుంది. చంద్ర నామాన్ని అను సరించి వీరికి ఇప్పుడు ఉగాది. సౌరనామాన్ని అనుసరించే తమిళ, మళయాల, బెంగాలీ, పంజాబీ, అస్సామీ ప్రజలకు ఉగాది వేరొక రోజున వస్తుంది. గుజరాతీలు, మార్వాడీలు, బృహస్పతి మాసాన్ననుసరించి ఉగాది జరుపుకుంటారు. కేరళలో ఉగాదిని 'విషు' పేరుతో ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. ఉగాది వసంత రుతువులో వస్తుంది కనుక చెట్లన్నీ కొత్త చిగుళ్ల వేసి, కోయిల పాటలతో, కొత్తపూల పరిమళాలతో ప్రకృతి శోభాయమానంగా ఉంటుంది. చెరకు, మామిడి, చింతపండు వంటి ఉత్పత్తులు చేతికందుతాయి. అందువల్లే ఆ రోజున కొత్త చింతపండు, కొత్తబెల్లం, చెరుకు ముక్కలు, పచ్చిమిరప, వేపపువ్వు, ఉప్పు, అరటిపండు కలిసి షడ్రుచులు గల ఉగాది పచ్చడి చేసుకుని ఆరగిస్తారు. అంతే కాదు, ముఖ్యంగా రైతులు ఏడాది పొడవునా సాగుచేసే పంటల్లో వచ్చే లాభ నష్టాలను కూడా ఉగాది రోజున బేరీజు వేసుకుంటారు. సంవత్సర ప్రాధాన్యతను బట్టి ఆరోజున పంచాంగం చూసి, రానున్న ఏడాదిలో వర్షాల పరిస్థితి, పంటల స్థితిగతులు ఎలా ఉండబోతాయో? అన్నది తెలుసుకుంటారు. పురోహితుడు చదివే పంచాంగాన్ని అందరూ శ్రద్ధగా వింటారు. సంవత్సరం ప్రారంభం కనుక ఈ రోజు ఏం జరిగితే సంవత్సరమంతా అదే జరుగుతుందని చాలా మంది నమ్ముతారు. నేటికీ పంచాగం ప్రకారం రైతులు నాగలి, భూమి పూజ నిర్వహించడం అనాదిగా సాగుతోంది. ఉగాది రోజు కొత్త దుస్తులు, నూతన ఆభరణాలు ధరించడానికి ఎక్కువ మంది ఇష్టపడతారు. పట్టణ ప్రాంతాల్లో వ్యాపారులూ ఉగాది పండగను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తారు. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో కుస్తీపోటీలు, పరుగు పందాలు, బలప్రదర్శనలు, ఎడ్లబండ్ల పందాలు వంటి వినోద కార్యక్రమాలు జరిగేవి. కార్పొరేట్ సంస్కృతి పెచ్చుమీరడంతో అటువంటి సందడి నేడు కనిపించడం లేదు. ఉగాది నాడు కవి సమ్మేళనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే సంస్కృతి కొనసాగుతోంది.

మానవుడు తన మనుగడ కోసం ప్రకృతిపై అనేక విజయాలు సాధించాడు. అయితే ప్రకృతితో మనిషి ఒంటరిగా పోరాడలేదు. సామూహికంగా, సమిష్టిగా పోరాడాడు. అందువల్ల ప్రకృతిపై విజయం సాధించినప్పుడల్లా సంతోషాన్ని కూడా సమిష్టిగానే పంచుకున్నారు. అవే సంబరాలు, ఉత్సవాలు అయ్యాయి. ఆదిమ సమాజంలో అగ్గి కొరకరాని కొయ్య. ఎముకలు కొరికే చలి నుంచి ఆది మానవుడ్ని కాపాడింది. అడవుల్లో క్రూరమృగాలను భయపెట్టి మానవుజాతి రక్షణకు దోహదపడింది. మాంసం, దుంపలు, కూరగాయలు, గింజలు, కాల్చుకు తినడం మొదలుకుని నేడు ఆహారాన్ని నిల్వ చేసుకోవడంతోపాటు అనేక రకాలుగా ఉపయోగపడుతోంది. ఈ నేపథ్యంలో అగ్గిని కనిపెట్టడం గొప్ప విజయంగా చెప్పకోవచ్చు. అదే వ్యవసాయ సమాజంలో పంటలు వేసే తరుణం, పంటచేతికొచ్చే తరుణం సంబరాలుగా మారాయి. ఇటువంటి సందర్భంలో నిర్వహించేదే ఉగాది పండగ. ఈ ఏడాది శ్రీ క్రోధి పేరుతో ఉగాది వచ్చింది.



ఉగాది వచ్చిందిలా..!

ఉగాది అంటే నక్షత్రాల నడక ప్రారంభించిందని అని అర్థం. చంద్రమానం పకారం చైత్రశుద్ధ పాఢ్యమి నాడు ఉగాది వస్తుంది. ఉగాది పుట్టుకకు అనేక పౌరాణిక చారిత్రక కథలు ఉన్నాయి. చైత్రమాసం నుంచి వసంత రుతువు మొదలవుతుంది. ఈ కాలంలో చెట్లు చిగురిస్తాయి. మానవ శరీరంలో కొన్ని మార్పులు చోటుచేసుకుంటాయి. శరీరంలో చర్మంపై వచ్చు చిన్న చిన్న పొక్కులు మూలంగా పొట్టు ఊడుతుంది. వసంతంలో కొత్త చర్మం వచ్చి శరీరానికి నవ చైతన్యం తీసుకువస్తుంది. పాములు కుబుసం విడవడం, నెమలి మొదలైన పక్షుల ఈకలు రాలడం, చెట్లు చిగురించడం, వాతావరణంలో మార్పులతో మానవ బుద్ధి వికాసమవుతుందని నమ్మకం.

ఉగాది నుంచి వసంత, నవరాత్రులు ప్రారంభమై శ్రీరామనవమితో ముగుస్తుంది. ఉగాదిన వేపపువ్వు కలిపిన ఉగాది పచ్చడి సేవించడం ఆనాదిగా వస్తున్న ఆచారం. ఈ ఆచారం వెనుక ఆరోగ్య సందేశమే దాగి ఉంది. వేప పూత, బెల్లం, చింతపండు, నెయ్యి, మిరియాలు లవణం కలిపిన షడ్రుచుల మిశ్రమాన్ని ఉగాది పచ్చడి అంటారు. వేప, బెల్లం తినడం వల్ల శరీరం దృఢంగా ఉంటుంది. సర్వ సుఖాలు కలిగి అరిష్టాలు నాశనమవుతాయి. ఇది నిజమేనా అంటే ఉగాది నుంచి ఎండలు ముదిరి వాతావరణంలో అనేక మార్పులు చోటుచేసుకుంటాయి. ఉగాది పచ్చడి సేవించడం ద్వారా కంటిచూపు, జీర్ణశక్తి వృద్ధి చెందుతాయి. షడ్రసాత్మకమైన ఈ పచ్చడిని కష్ట సుఖ సమ్మిశితమైన మానవ జీవితానికి ప్రతీకగా నిర్ణయించారు.

ఔషధ విలువల సమ్మేళనం

ప్రజాశక్తి - రణస్థలం

ఔషధ విలువల సమ్మేళనమే ఉగాది పచ్చడి. వేప పువ్వు, లేతమామిడి కాయలు, పచ్చి మిర్చి, అరటిపండు, కొత్త చింతపండు, కొత్త బెల్లం, మిరియాల పొడి, ఉప్ప మిశ్రమమే ఉగాది పచ్చడి. చేదుగా, తియ్యగా, వగరుగా, ఘాటుగా, పులుపుగా, షడ్రుచుల సంగమం ఉగాది పచ్చడి. మనిషి జీవితంలో జరిగే ఒడిదుడుకులకూ, సుఖదుఃఖాలకూ దీన్ని ప్రతీకగా చెబుతుంటారు.

వేపపువ్వు చేదు అనుకుంటాం గానీ, మన ఆరోగ్యాన్ని కాపాడే అమృతం అది. ఈ పువ్వులో విటమిన్ ఎ, కాల్షియం, ప్రొటీన్లు పుష్కలంగా ఉన్నాయి. వాతం, జ్వరం దగ్గను దరిచేరనివ్వదు. వేపాకులు, వేపపువ్వ క్రిమిసంహారిణి కావడం వల్ల అమ్మవారు (పొంగు) పోసినపుడు పక్కలోనే ఉంచుతాం. వేప చిగుళ్ల నూరి మాత్రలుగా చేసి, పసుపు కలిపి మింగిస్తున్నాం. గజ్జి, కుష్టు వంటి వ్యాధుల్నీ ఇది హరిస్తుందని ఆయుర్వేదం చెప్తోంది. జీర్ణక్రియను సజావుగా నిలుపుతుంది. చర్మవ్యాధుల్ని అరికడుతుంది. మామిడిలో విటమిన్ 'సి', 'ఎ'లతో పాటు మరెన్నో పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. పేగు క్యాన్సర్ ఉన్న వారికి మంచిదని డాక్టర్లు చెబుతున్నారు. చెటమ రూపంలో పోతున్న శక్తిని ఉప్పు తిరిగి శరీరానికి అందిస్తుంది. ఎముకలకు పుష్టిని ఇస్తుంది. తీపి చక్కెర, బెల్లంలో ఉంటుంది. బెల్లం ఆరోగ్యానికి శ్రేయస్కరం. రక్తాన్ని వృద్ధిపరుస్తుంది. కాలేయాన్ని శుద్ధిచేసి కామెర్ల వ్యాధిని నివారిస్తుంది. శరీరానికి బలాన్నిస్తుంది. మిరియాల కషాయం గురించి తెలిసిందే. అది కఫవాతాలను పోగొట్టి దగ్గు, శ్లేష రోగాలను అరికడుతుంది. పులుపునిచ్చే చింతపండులో విటమిన్ 'డి', 'సి' పుష్కలంగా ఉంటాయి. ఇది పైత్యాన్ని, అరుచిని పోగొడుతుంది.



కూయవే ఓ కోయిలా...



ఉగాది దగ్గర పడుతుంటే ఉత్సాహంతో ఉరకలేస్తోంది కోయిలమ్మ. పాటలే లోకంగా పరవశిస్తోంది! ఆ ఆనందంతో ఉగాది సన్నాహాలు ఎలా ఉన్నాయో చూద్దామని బయల్దేరింది.

కొండా కోనా దాటింది. వాగూవంకా వెతికింది. చెట్టూ పుట్టా చూసింది. ఊరూవాడా గాలించింది. ఎక్కడుంది సందడని వెతుకుతూనే సాగుతోంది!

ఓ చోట పసిపాప చిరునవ్వులా విరబూసి, వేపచెట్టు కనిపించింది. కోయిల ఆ చెట్టుపై వాలి కుహూ కుహూ అని పాడబోయింది. కాపలాదారు గద్దింపు వినిపించి, ఆగిపోయింది. వేపచెట్టుకు కూడా కాపలానా!? అని ఆశ్చర్యపోతుంటే– చెట్టుకు దిగేసిన ఇనుపరేకు కనిపించింది. దానిపై 'ఈ చెట్టుపై అమెరికాది పేటెంటు. ఆకు కోసినా, పువ్వు తెంపినా తప్పదు చీకటికొట్టు.' అన్న హెచ్చరిక ఉంది.

నివ్వెరపోయిన కోయిల నింగిలోకి ఎగిరింది.

ఎంతసేపో ఎగిరెగిరి ఓ తోట గట్టున వాలింది.

అది నిండుగా పండిన చెరుకుతోట. తీపివాసన మనసును మధురం చేస్తుంటే... గొంతెత్తబోయింది. గట్టుపై విషాదం నింపుకున్న రైతు కనిపించాడు. 'తోట ఇలా తొణికిసలాడుతుంటే– నీ ముఖంలో విచారం ఎందుకన్నా?' అని అడిగింది. 'ఎందుకా? ఇది తీపి చెరకు కాదు, చేదునిచ్చే సరుకు. ధర దక్కని పంట. మా జీవితాలకు మంట.' అని చిరచిరలాడాడు రైతు.

అన్నదాతకు ఇంత ఆవేదనా? అని కలవరపడింది. అక్కడ నిలవలేక ఎగిరిపోయింది.

ఓ వీధి చివరి పెరట్లో విరగగాచిన మామిడి కనిపించింది. అయితే, ఆ ఇంట్లోని పిల్లలు ఆ తియ్యని పుల్లని కాయల కోసం తహతహలాడడం లేదు. టెంక లేని మామిడిలో మజా ఆస్వాదిస్తున్నారు. చివుక్కుమంది మనసు. పాటను మరిచిపోయి, పైకెగిరింది.

కోనసీమలాంటి ఉద్దాన తీరంలో కొబ్బరి పంట కోటి తెగుళ్లతో కునారిల్లుతూ కనిపించింది. దిగుబడీ, ధరా లేక దిగులుగా ఉంది. కొండ మీద 'ధర' లేదని చింతించిన చింతపండు.. పట్టణం ప్యాకెట్లో సరికొత్తగా పలకరించింది. ఇప్పుడు రేటు ఎక్కువై సామాన్యుడికి భారమయ్యానని బాధపడింది! కోయిలమ్మ ఉత్సాహం నీరు కారిపోయింది. నీరసం ఆవరించింది. పచ్చడి దినుసులే ఇంత భారమైతే, పండగ ఇంకెంత భారమో? అనుకుంది.

ఇంతలో 'కుహూకుహూ'మని ఓ కమ్మని స్వరం వినిపించింది. ప్రాణం లేచొచ్చి, అటు చూసింది. అదో సెల్‌ఫోను కాలర్ ట్యూను! తన గొంతునిలా వెంటపెట్టుకున్నందుకు సంతోషించాలా? వసంతకోకిల కోసం ఎదురుచూసే జనం ఉండరని విచారించాలా?

'హ్యాపీ టెల్గు న్యూ ఇయర్, హ్యాపీ ఉగాదీ...' ఫోన్‌లో తన మిత్రుడికి చెబుతున్నాడు సెల్‌వాలా!

'హతవిధీ... తెలుగు సంవత్సరాదికి ఏమి దుస్థితి ఇది?!' అనుకుంటూ కొండకోనలవైపు ఎగిరిపోయింది... పాపం... కోయిలమ్మ!

- సత్యాజీ

విద్యార్థులు ఉన్నత స్థానంలో నిలవాలి


మాట్లాడుతున్న సిఐ అవతారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తల్లి, తండ్రులకు మనమంతా రుణపడి ఉన్నామని, జన్మనిచ్చిన తల్లి తండ్రులకోసం మనం ఎంత చెప్పినా తక్కువేనని మునసబుపేటలో గాయత్రి కాలేజెస్ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల సహకారంతో సోమవారం జెసిఐ శ్రీకాకుళం మెయిన్ అధ్యక్షులు కూన అనీల్ కుమార్ ఆధ్వర్యాన జరిగిన ట్రాఫిక్ అవగాహన కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ ఎం. అవతారం అన్నారు. ఈ సందర్భంగా అవతారం మాట్లాడుతూ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని, విద్యార్థులకు గాయత్రి కళాశాల దొరకటం అదృష్టమని, కొన్ని చెడు వ్యసనాలకు లోబడి చదువుని నిర్లక్ష్యం చేస్తూ తప్పుదోవలో వెళ్తున్నారన్నారు. గత మూడు ఏళ్లలో జరిగిన రహదారి ప్రమాదాల వివరాలను, చిత్రాలను ప్రొజెక్టర్ సహాయంతో విద్యార్థులందరికీ చూపిస్తూ, ప్రమాదాలకు కారణమైన వివరాలను విద్యార్థులకు అర్థమయ్యే విధంగా వివరించారు. విద్యార్థులు కళాశాలకు వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకొని వాహనాన్ని నడపాలన్నారు. జెసిఐ అధ్యక్షులు కూన అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు ఉర్లం శివతేజ మాట్లాడుతూ విద్యార్థులు సమాజంపై సరైన అవగాహన లేకపోవటంతో తప్పటడుగులు వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.పులఖండం శ్రీనివాసరావు, జెసిఐ శ్రీకాకుళం మెయిన్ సభ్యులు మామిడి పోసక్ కుమార్, కిల్లి శేఖర్, సుప్రజ రౌతు, గాయత్రీ కళాశాల తెలుగు విభాగాధిపతి బి.గౌరీ శంకర్, అప్పలనాయుడు, కెవి సత్యన్నారాయణ, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ మార్తాండ కృష్ణ పాల్గొన్నారు.

15న అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ సమావేశం


మాట్లాడుతున్న సన్యాసినాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఈనెల 15న అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. సోమవారం న్యాయసదన్‌లో అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ సమావేశంలో జైలు విజిటింగ్ న్యాయవాదులకు, పారా లీగల్ వాలంటీర్లకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారా లీగల్ వాలంటీర్లు జైలులో ముద్దాయిలు ఎవరైనా బెయిల్ వచ్చిన ష్యూరిటీ లేక జైల్లో మగుతున్న వారి వివరాలు ఆరా తీయాలని, జైల్లో ఉన్న మహిళల కేసులు వివరాలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారి వివరాలు పొందుపర్చాలని తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కొమరాపు ఆఫీసు, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పుట్ట ఆంజనీ కుమార్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పైడి హర్షవర్ధన్, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలి


సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన ఎస్‌సి కాలనీవాసులు

ప్రజాశక్తి- పొందూరు

మండలం లైదాంలోని ఎస్‌సి కాలనీలో గత కొన్నేళ్లుగా నెలకొన్న విద్యుత్ లోవోల్టేజీ సమస్యను పరిష్కరిం చాలంటూ ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదంటూ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సర్పంచ్ గొర్లె అనంత రామకృష్ణతో కలిసి రాపాక కూడలిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. కాలనీలో లోవోల్టేజీ వలన రాత్రివేళల్లో చిన్నారులు, బాలింతలు, గర్భిణులు తీవ్ర అవస్థలు పడుతున్నారని వాపోయారు. ఇటీవల కాలనీలో విద్యుత్ కనెక్షన్లు పెరిగాయని, అందుకుతగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయలేదని, దీనివలన తరుచుగా లోవోల్టేజీ సమస్య ఏర్పడుతుందన్నారు. దీనిపై జిల్లాస్థాయి అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. విద్యుత్ ఎఇ దుర్గాప్రసాద్‌ను ఫోన్‌లో సర్పంచ్ సంప్రదించగా కొద్ది రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో వారంతా వెనుతిరగారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు యలకల రమణ, కాలనీకి చెందిన యువకులు పాల్గొన్నారు.

అరసవల్లి సందర్శించిన దర్శకుడు చందు


ఆశీర్వచనం తీసుకుంటున్న చందు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సోమవారం తెలుగు చిత్ర దర్శకుడు చందు మొండేటి సందర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతించారు. ఆలయంలో స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం అనివేటి మండపంలో ఆయనకు స్వామివారి శేష వస్త్రాలను కప్పి మెమోంటోను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులతో పాటు జూనియర్ అసిస్టెంట్ బి ఎస్ చక్రవరి పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి- జి.సిగడాం

2024-25 విద్యా సంవత్సరంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్టు మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లంక అన్నా శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిసి, బైపిసి, ఎంఇసి, సిఇసి గ్రూపుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంగ్లీష్ మీడియంలో బోధన ఉంటుందన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. మే 22లోపు https://apms.apcfss.in, https://cse.ap.gov.in వెబ్‌సైట్ల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఒసి, బిసి, ఇడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు రూ.150 చొప్పన ఫీజు చెల్లించాలన్నారు.

చిరస్మరణీయులు ధర్మారావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ప్రాచీన సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడిన మహోన్నత వ్యక్తి దూసి ధర్మారావు అని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. సోమవారం ఆయన జయంతిని పురస్కరించుకుని నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో రక్తదాన శిబిరంతో పాటు దుప్పట్లు పంపిణీ కార్యక్రమాలను నిర్వహించారు. 20 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో కనుగుల దుర్గా శ్రీనివాస్, బలివాడ మల్లేశ్వరరావు, దూసి వెంకట రమణమూర్తి, మండ శ్రీనివాస్, సురంగి మోహనరావు, నిక్కు అప్పన్న, ఆర్ట్స్ సన్యాసిరావు, చక్రవర్తి, బి.సతీష్, పెంకి చైతన్య కుమార్ పాల్గొన్నారు.


దుప్పట్లు పంపిణీ చేస్తున్న జగన్మోహనరావు

మూకుమ్మడిగా వాలంటీర్లు రాజీనామా


కోటబొమ్మాళి : రాజీనామా పత్రాలను అందజేస్తున్న వాలంటీర్లు

కోటబొమ్మాళి: మండలంలోని లఖందిడ్డి, కోటబొమ్మాళి, హరిశ్చంద్రపురం, యలమంచిలి, ఎత్తురాళ్లపాడు పంచాయతీలకు చెందిన 60 మంది వాలంటీర్లు సామూహిక రాజీనామాలు చేస్తున్నామని తెలిపారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శులకు రాజీనామా పత్రాలను అందజేశామన్నారు. కార్యక్రమంలో మండల విప్ బొడ్డు అప్పన్న, నాయకులు పేడాడ వెంకటరావు, బోయిన క్రిష్ణారావు, వాలంటీర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: మండలంలోని వల్లభరావుపేట పంచాయతీ సచివాలయ పరిధిలో 10 మంది గ్రామ వాలంటీర్లు ప్రతిపక్ష పార్టీల ఆరోపణలకు వ్యతిరేకంగా స్వచ్ఛందంగా సోమవారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు మరింత చేరువై రాబోయే ఎన్నికల్లో సిఎంగా జగన్మోహన్ రెడ్డి, ఎమ్మెల్యేగా గొర్లె కిరణ్‌కుమార్‌ను గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కార్యదర్శి గురాన మానస, చిరంజీవి, సచివాలయం కన్వీనర్ మహంతి సత్యనారాయణ, సచివాలయ కన్వీనర్ కొత్తకోట్ల పరిశినాయుడు, సచివాలయ బూత్ కన్వీనర్ పాలూరి బుజ్జి, గడి రమణ, గడి బాబురావు, పిల్ల సూర్యారావు, పిల్ల రమేష్ పాల్గొన్నారు.

లావేరు: మండలంలోని గుమ్మడం గ్రామ సచివాలయానికి చెందిన 17 మంది గ్రామ వాలంటీర్లు రాజీనామా చేశారు. వీరంతా గ్రామ సర్పంచ్ ప్రతినిధి దుర్గశి ధర్మారావు, ఎంపిటిసి జగ్గారోతు తవిటినాయుడు ఆధ్వర్యంలో రాజీనామా చేసి సచివాలయ కార్యదర్శికి అందజేశారు.

మెళియాపుట్టి : మండలంలోని పెద్దపద్మాపురం, కరజాడ పంచాయతీలకు చెందిన 8 మంది వాలంటీర్లు ముకుమ్మడి రాజీనామాలు చేశారు. రాజీనామా పత్రాలను ఆయా సచివాలయ కార్యదర్శి చింతల అప్పారావుకు అందజేశారు.

జి. సిగడాం: మండలంలో పలు గ్రామాలకు చెందిన వాలంటీర్లు సోమవారం 98 మంది రాజీనామాలు చేశారు. ఆనందపురం 6, బాతువ 19, సిగడాం 1, జగన్నాథవలస 8, పాలకండ్యం 9, పెంట 13, పున్నం 13, సంతవురిటి 12, సీతంపేట ఒకరు, సీతుభీమవరం 10, ఎందువ 5 మంది రాజీనామా పత్రాలను ఎంపిడిఒ వెంకన్న బాబుకు అందించారు.


లావేరు : రాజీనామా పత్రాలను చూపిస్తున్న వాలంటీర్లు


రణస్థలం : రాజీనామా పత్రాలతో వాలంటీర్లు

పలాస పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటి సచివాలయం పరిధిలో 30వ వార్డుకు చెందిన ఏడుగురు వాలంటీర్లు రాజీనామాలు సమర్పించారు. వీరంతా వైసిపి ప్రచారంలో పాల్గొనడానికి వీలుగా రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. వీరి రాజీనామాను మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ ధ్రువీకరించారు.

కవిటి: కవిటి మండలంలో కవిటి 1,2,3 సచివాలయాల పరిధిలో 61 మంది వాలంటీర్లకు గాను, 49 వాలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలు చేసినట్టు ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి తెలిపారు. దీనిపై వాలంటీర్లను సంప్రదించ గా తమపై ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఈ రాజీనామాలు చేసినట్టు తెలిపారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని అక్కుపల్లి సచివాలయ వాలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. రాజీనామా చేసిన వారిలో యంపల్ల యోగి, అంబటి రామకృష్ణ, దివాకర్, ఇప్పిలి రాజేష్, కాస లోకనాథ్, కోడ లిజా, మడ్డు మంజుల, కె.పూజ, దాసరి నిరోసా, మనీష, లండ భవానీ, మడ్డు లత, సింగుపల్లి జోత్స్న ఉన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా 'దివ్వల'


వివేకానంద

టెక్కలి : టెక్కలి బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా దివ్వల వివేకానంద మళ్లీ గెలుపొందారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షునిగా దివ్వెల వివేకనంద, ఉపాధ్యక్షుడిగా దాడి ధర్మారావు, కార్యదర్శిగా సంపత్‌రావు దివాకర్, సంయుక్త కార్యదర్శిగా మామిడి గాయత్రి శాలిని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా పి.మధుబాబు, అద్దాల రాజేషులు వ్యవహరించారు.


మాట్లాడుతున్న గోవిందరాజులు

జన సమీకరణకు వైసిపి తంటాలు

కోటబొమ్మాళి: సిఎం జగన్ చేపడుతున్న బస్సు యాత్రకు జనసమీకరణకు నానా తంటాలు పడుతున్నారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో టెక్కలి నియోజకవర్గ ఎన్‌డిఎ కూటమి నాయకులతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వంపై నిరుద్యోగులు, అక్షరాసులు, ఉద్యోగులు తీవ్ర వ్యతిరేకంతో ఉన్నారన్న అన్నారు. విస్తృతంగా ప్రచారం చేపట్టి ఎమ్మెల్యే అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్ నాయుడు గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ నాయకులు కణితి కిరణ్, బిజెపి రాష్ట్ర కార్యదర్శి పూడి తిరుపతిరావు, టెక్కలి నియోజకవర్గ కన్వీనర్ అట్టాడ అట్టాడ రవి బాబ్జి, తెలుగు యుత మహిళా నియోజకవర్గ అధ్యక్షులు పూజారి శైలజ, మాజీ ఎంపిపి వెలమల విజయలక్ష్మి, కామేశ్వరావు, తర్ర రామకృష్ణ పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న అధికారులు

ప్రణాళికలతో పంచాయతీల అభివృద్ధి

కవిటి: పక్కా ప్రణాళికలతో పంచాయతీల అభివృద్ధి సాధ్యమని ఇఒపిఆర్‌ఆర్‌డి శివాజీ పాణిగ్రాహి అన్నారు. మండలంలోని 23 పంచాయతీలకు సంబంధించిన అభివృద్ధి ప్రణాళికలను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పరిశీలించారు. కవిటి, ఇచ్ఛాపురం ఇఒపిఆర్‌ఆర్‌డిలు శివాజీ పాణిగ్రాహి, సత్యనారాయణ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో 23 పంచాయతీల పరిధిలో నిబంధనల మేరకు పనుల జాబితాలను సరిచేసి సిద్ధం చేశారు. కార్యక్రమంలో డిపిఆర్‌సి రిసోర్స్ పర్సన్ పి.ఆనందరావు, ఎంఒటిలు కె.జయప్రకాష్, అబ్దుల్ ఖాన్ పాల్గొన్నారు.

'పద్మావతి'లో ఉగాది వేడుకలు

నరసన్నపేట: స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ముందస్తు ఉగాది ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉగాది పచ్చడితో పాటు వివిధ వంటకాలతో పండుగను కుటుంబ వాతావరణంలో జరుపుకున్నారు. కళాశాల డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఈ ఏడాది సమాజంలో అన్ని తరగతుల వారు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. తెలుగు అధ్యాపకులు లక్కోజు గౌరీ శంకర్ పంచాంగ శ్రవణం చేశారు. విద్యార్థులు ఉగాది కవితలు ఆలపించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమణమూర్తి, అడమిక్ ఇన్‌ఛార్జి ముకల్ల శ్రీనివాసరావు, బాలమురళి పాల్గొన్నారు.


నరసన్నపేట : మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

కేన్సర్ బాధిత కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న సమితి సభ్యులు

శ్రీకాకుళం అర్బన్ : మండలం కళ్లేపల్లికి చెందిన లోకనాథం పద్మ గ్రామ పరిధిలో మని నాగేశ్వర స్వామి ఆలయం వద్ద సేవకురాలుగా పని చేస్తూ మొదడుకు సంబం ధించిన క్యాన్సర్ బారిన పడింది. ఆమె ఇబ్బందుల్లో ఉన్నారని తెలు సుకుని సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి సభ్యులు ఉర్లం శివతేజ ఆధ్వర్యాన ఆమె కీమోథెరపీ చేయించు కునేందుకు సాయంగా రూ.11వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆమె భర్త కొద్ది నెలల క్రితం చనిపోయాడు. ప్రస్తుతం ఆమె ఒంటరి జీవనం కొనసాగి స్తున్నారు. వైద్యానికి, తిండికి ఇబ్బంది పడుతున్నట్టు సిక్కోలు స్వచ్ఛంద సంస్థ సభ్యులకు తెలియడంతో తక్షణమే స్పందించి ఈ సాయాన్ని సోమవారం అందజే శారు. సంస్థ సభ్యులు శివతేజ, జగదీష్, బాలకృష్ణ, చరణ్, రాజు యాదవ్, జయనంద పాల్గొన్నారు.

నగరంలో అన్నదానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అన్నదానం మహాదానమని రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ట నాగరాజు అన్నారు. సినీ నటుడు అల్లు అర్జున్ పుట్టిన రోజును పురస్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఫ్యాన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏడురోడ్ల జంక్షన్ వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మెగా అభిమాన సంఘాల ప్రతినిధులు తైక్వాండో శ్రీను, వైశ్యరాజు మోహన్, నాగరాజు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పుక్కళ్ల నవీన్, సభ్యులు భాను, బన్నీ, గిరి రమణారెడ్డి, పవన్, సాయి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గౌతు శిరీష

గెలుపే లక్ష్యం

పలాస: రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైసిపి ప్రభుత్వానికి ఇంటికీ పంపించాల్సిన సమయం ఆసన్నమైందని, టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థులను గెలుపే లక్ష్యంగా పనిచేయాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పిలుపునిచ్చారు. పలాస టిడిపి కార్యాలయంలో కూటమి నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి నాయకులు ఒకే తాటి పైకి వచ్చి సమన్వయంతో ముందుకు పోవాలన్నారు. పలాస నియోజకవర్గంలో ప్రచారాలు విస్తృతం చేయాలన్నారు. మంత్రి సీదిరి అప్పలరాజు చేసిన అక్రమాలను ప్రజలకు వివరించి సార్వత్రిక ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, బిజెపి నాయకులు రామానందస్వామి, జనసేన నాయకులు డాక్టర్ బి.దుర్గారావు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

నౌపడ : సంతబొమ్మాళి మండలం మరువాడ పంచాయతీ సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి, దాసురాజుల కుమార్తె మోక్షశ్రీ సోమవారం పుట్టిన రోజు. ఈ సందర్భంగా రెడ్డిక మరువాడలోని లక్ష్మీనరసింహస్వామి సింహద్వార నిర్మాణానికి రూ.21 వేలు విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు ఆ మొత్తాన్ని కుమార్తె మోక్షశ్రీ చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.


విరాళాన్ని అందజేస్తున్న దాసురాజు

30 మంది రక్తదానం

పలాస: రక్తదానం చేయడం ద్వారా మరొకరి ప్రాణం కాపాడుతుందని స్తానిక వైద్యులు కూన పవన్ కుమార్, ప్రధాన్, రామ్‌నరేష్, మేఘన అన్నారు. పలాసలో నవతరం సేవా సంస్థ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ప్రాణదాత బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో తలసే మియా పిల్లల కోసం రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాన శిబిరంలో స్వచ్ఛందంగా 30 మంది పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో నవతరం సేవా సంస్థ ఫౌండర్ రవితేజ, అధ్యక్షులు సుప్రజ, లయన్స్ బ్లడ్ బ్యాంకు సునీల్, జిఎన్‌వి జ్యూలయరీ లక్కీ షాపింగ్ మాల్ సిబ్బంది, సునీత కృష్ణ పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న యువకులు

టిడిపిలో పలువురు చేరిక


టిడిపిలో చేరిన వారితో రవికుమార్

పలాస : పలాస టిడిపి కార్యాలయంలో టిడిపి కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష సమక్షంలో మందస మండలం దున్నూరు, లోహరిబంద, ధర్మాపురం గ్రామాల వైసిపి నుంచి 20 కుటుంబాలు టిడిపిలో చేరారు. వారికి గౌతు శిరీష పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో దున్న త్రినాథరావు, దుమ్ము కృష్ణమూర్తి, దున్న కేశవయ్య, దుమ్ము పురుషోత్తం, దున్న తాతారావు, దుమ్ము లక్ష్మీనారాయణ, బద్రి జానకిరావు, దున్న భాస్కరరావు తదితరులు ఉన్నారు.

పొందూరు: మండలం అచ్చిపోలవలస పంచాయతీ సింగూరుకు చెందిన సుమారు 10 కుటుంబాలు సోమవారం టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ సమక్షంలో ఆయన స్వగృహంలో టిడిపిలో చేరారు. గ్రామానికి చెందిన బొడ్డేపల్లి గోవిందరావు, తమ్మినేని సుదర్శనరావు, బాడాన కూర్మారావు, సింగూరు లక్ష్మణరావుతో పాటు పలువురు వైసిపి నుంచి టిడిపిలో చేరారు. వీరికి రవికుమార్ టిడిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దుప్పల గణపతిరావు, జగన్మోహన్, మధుసూదన్, తేజేశ్వరరావు పాల్గొన్నారు.

టిడిపి విస్తృత ప్రచారం



బూర్జ : ఇంటింటా ప్రచారం చేస్తున్న రవికుమార్

ప్రజాశక్తి- బూర్జ

మండల కేంద్రమైన బూర్జలో టిడిపి శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు కూన రవికుమార్ సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ పోస్టర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను ఆదుకోవాలని ధ్యేయంగా పార్టీ పనిచేస్తుందన్నారు. కర్షకులకు కష్ట కాలంలో టిడిపి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ట్రాక్టర్ డ్రైవింగ్ చేస్తూ రైతులను ఆనందపరిచారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు, బిజెపి నాయకుడు సూర నాయుడు, మాజీ జెడ్‌పిటిసి ఆనెపు రామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు వావిలిపల్లి సీతారాం బాబు, ఎంపిటిసి పాలీ నాయుడు, నాయకులు వేపారి వెంకటేశ, జనసేన మండల పార్టీ అధ్యక్షులు కొత్తకోట నాగేందర్, తూర్పుకాపు రాష్ట్ర ఉపాధ్యక్షులు జైరాం, విక్రమ్ పాల్గొన్నారు.

పలాస : మండలంలోని నీలిభద్ర, పెద్ద నారాయణపురం గ్రామాల్లో టిడిపి అభ్యర్థి గౌతు శిరీష, ఎంపీ అభ్యర్థి రామ్మోహన్ నాయుడు గెలిపించాలని టిడిపి నాయకులు ఇంటింటా ప్రచారం చేపట్టారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, దువ్వాడ సంతోష్ రామ్‌నాయుడు, తమ్మినేని గంగారం, ఈశ్వరరావు, అవగాన దశరథ పాల్గొన్నారు.

మందస మండలం బుడార్సింగి గ్రామ పంచాయతీ పాతకోట, కురడాల, పేడంగో, మహల్పడ, నర్సింగిపురం గ్రామాల్లో టిడిపి నాయకులు ప్రచారం చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు భావన దుర్యోధన, మండల నాయకులు రట్టి లింగరాజు, దేబాసిస్ పండా, బత్తిన తారకేశ్వరరావు, సంతోష్ గౌడ, నీలాంచల్ సాహు, భగవాన్ బిస్వాల్, ఢిల్లీశ్వర దోలాయి, ప్రేమానంద బిస్వాల్, బొరిగౌడ, బృందావన్ గౌడ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : సైకిల్ గుర్తుపై ఓటు వేసి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బెందాళం అశోక్, ఎంపీ రామ్మోహన్ నాయుడులను గెలిపించాలని మండలంలోని ముచింద్ర, బెనిగానిపేట గ్రామాల్లో కూటమి నాయకులు ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి దక్కత ఢిల్లీరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, మంగి లక్ష్మీ, లీలారాణి, శ్రీను, కామేశ్వరరావు, సహదేవ్, నరేంద్ర, పద్మనాభం, భాస్కరరావు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం : ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు



మాట్లాడుతున్న కృష్ణదాస్

నేటి నుంచి రెండో విడత ప్రచారం

ప్రజాశక్తి- పోలాకి

ఈ నెల 9 నుంచి రెండో ప్రచారం చేస్తున్నామని, కార్యకర్తలు, నాయకులు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే కృష్ణదాస్ అన్నారు. స్థానిక ఎస్‌ఎల్‌విడి కళ్యాణ మండపంలో నరసన్నపేట, పోలాకి మండలాల కార్యకర్తలతో సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటి వరకు నాలుగు మండలాల్లో 21 పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం చేపట్టనని అన్నారు. ఉగాది రోజు సాయంత్రం నుంచి 12 రోజుల పాటు రెండో విడత ప్రచారం మొదలు పెడతానని చెప్పారు. అలాగే ఈ నెల 25 నామినేషన్ దాఖలు చేసి.. అదే రోజున బహిరంగ సభ ఉంటుందని స్పష్టం చేశారు. త్వరలో సిఎం జగన్ బస్సు యాత్ర ఉంటుందని, దీని విజయవంతానికి సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ధర్మాన క్రిష్ణ చైతన్య, సీనియర్ నాయకులు ధర్మాన రామదాస్, డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపిలు ఆరంగి మురళీధర్, ముద్దాడ భైరాగినాయుడు, జెడ్‌పిటిసి చింతు రామారావు, పిఎసిఎస్ అధ్యక్షులు పొన్నాన దాలినాయుడు, పొందర కార్పొరేషన్ చైర్మన్ రాజాపు అప్పన్న, సుడాప్ చైర్మన్ కోరాడ చంద్రభూషణ గుప్త పాల్గొన్నారు.



పోస్టర్‌ను అందజేస్తున్న విజయ

ఆటో యూనియన్ సమస్యలు పరిష్కరిస్తా

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురంలో మ్యాజిక్ ఆటో యూనియన్ సభ్యులు తన దృష్టికి తీసుకొస్తే సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ హామీనిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ధనాలమ్మ మేజిక్ ఆటో యూనియన్ సభ్యులతో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈదుపురం, కాపాసుకొద్ది, కవిటి, సోంపేట, బారువ పంచాయతీల్లో ప్రయాణికుల వాహనాలైనా తమ నుంచి బలవంతంగా ఆశీలు వసూలు చేస్తున్నారని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. టోల్ గేట్‌లో కేవలం 30 వాహనాలకు మాత్రమే నెలా వారీ పాస్‌లు ఇస్తున్నారని అన్నారు. అసోసియేషన్‌లో 60 వాహనాలు ఉన్నాయని తెలిపారు. అసోసియేషన్ భవన నిర్మాణానికి స్థలం మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో కౌన్సిలర్ బచ్చ జగన్, పట్టణ కార్యదర్శి బర్ల లక్ష్మణరావు, సీనియర్ నాయకులు పటన కృష్ణ, గుజ్జు హనుమ, పట్టణ కన్వీనర్ సాలినా ఢిల్లీరావు, చాట్ల లోహిదాస్, నీలపు ఢిల్లీరావు పాల్గొన్నారు.

గాంధీని గెలిపించాలి

పొందూరు: ఆమదాలవలస నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీని రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన భార్య, మాజీ ఎంపిపి, ఎంపిటిసి సువ్వారి దివ్య అభ్యర్థించారు. మండలం కోటిపల్లి పంచాయతీ మజ్జిలిపేటలో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ గాంధీని గెలిపించాలని ఆమె ఓటర్లను కోరారు. ఈమెతో పాటు జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ సువ్వారి సువర్ణ, ఢిల్లీశ్వరరావు, సూర్యారావు, సాయికుమార్ పాల్గొన్నారు.



మజ్జిలిపేటలో ప్రచారం చేస్తున్న దివ్య



ఏరువాక కోసం కర్రలను కొనుగోలు చేస్తున్న రైతులు

మార్కెట్‌కు ఉగాది శోభ

ఆమదాలవలస : తెలుగు కొత్త సంవత్సరాది రైతాంగ పెద్ద పండుగ ఉగాది సందర్భంగా పట్టణంలో జన సందడి కనిపించింది. ప్రజలు ఉగాది రోజు ఉగాది పచ్చడి తయారీకి అవసరమైన వివిధ రకాల సామగ్రి కొనుగోలుతో పాటు పూజలకు అవసరమైన సామాన్లు కొనుగోలు చేయటానికి మహిళలు అధిక సంఖ్యలో మార్కెట్‌కు వచ్చారు. అలాగే రైతులు ఎక్కువగా జరుపుకునే ఈ ఉగాది పండుగకు పురోహితులు నిర్ణయించిన ఏరువాక ముహూర్తానికి అవసరమైన కొత్త కర్ర, మోకులు, తాళ్లు కొనుగోలుకు రైతులు వివిధ గ్రామాల నుంచి మార్కెట్‌కు రావడంతో ఉగాది శోభ పూర్తిస్థాయిలో కనిపించింది.



ప్రచారం చేస్తున్న నాగభూషణరావు

కాంగ్రెస్ అభ్యర్థి ప్రచారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సార్వత్రిక ఎన్నికల్లో శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి పైడి నాగభూషణరావు గార మండలం అంబటివాని పేటలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాలు కాపాడడం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షులు దేశెల్లి గోవింద, మల్లిబాబు, రాష్ట్ర అధికార ప్రతినిధి చింతాడ దిలీప్, వామపక్ష నాయకులు చలపతి పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు వైద్య పరీక్షలు

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని ఎన్‌జిఒ హోంలో ప్రభుత్వ రిటైర్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్, అమృత మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి సంయుక్తంగా కంటి వైద్య పరీక్షలతో పాటు ఇతర సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కంటి పరీక్షల్లో శస్త్ర చికిత్స అవసరమైన ఆరుగురుని విశాఖలోని శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. శిబిరంలో ఫౌండేషన్ ఐ ఆస్పత్రి డాక్టర్ గీతాంజలి, అమత మల్టీ స్పెషాలిటీ డెంటల్ ఆస్పత్రి వైద్యులు ప్రేమ్ సక్కరి, డాక్టర్ మహే, జిల్లా సంఘ అధ్యక్షులు సోమసుందరరావు, ప్రధాన కార్యదర్శి పిఎస్ ప్రసాదరావు పాల్గొన్నారు. ప్రతి నెలా రెండో సోమవారం వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు.

వైసిపిని సాగనంపేందుకు ప్రజలు సిద్ధం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

ఎమ్మెల్యే బెందాళం అశోక్

ప్రజాశక్తి- కవిటి

గత ఐదేళ్లుగా వైసిపి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు శృతి మించిపోయాయని, వీటన్నిటినీ గమనిస్తున్న ప్రజలు ఈ ఆకృత్యాలకు అడ్డుకట్ట వేసి ఈ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. వైసిపి నాయకులు పింఛన్ల పంపిణీలో శవ రాజకీయాలు చేశారని అన్నారు. పింఛన్ల పంపిణీకి ఖజానాలో డబ్బులేక తమ తప్పులు ప్రతిపక్షాలపై నెట్టడానికి ప్రయత్నించారని ఆరోపించారు. ఏప్రిల్ 4న నమాజ్ చేసి తిరిగి వస్తున్న ముస్లిం మహిళపై వైసిపి నాయకుడు శ్రీనివాసరెడ్డి దాడి చేయడం గర్హనీయమని అన్నారు. గురజాలలో ముస్లిం మైనర్ అత్యాచారం కేసు నీరుగార్చేశారని, నిందితుడు వైసిపి ఎమ్మెల్యే శంకరరావుకు అనుచరుడు కావడమే దీనికి కారణమని ఆరోపించారు. టిడిపి అధికారంలోకి వచ్చాక 20 లక్షల ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, అంతవరకు రూ.3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి అందిస్తామని తెలిపారు. సమావేశంలో స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కొలిక్కిరాని కాంగ్రెస్ అభ్యర్థుల పేర్లు

ప్రజాశక్తి- టెక్కలి

కేంద్ర మాజీ సహాయ మంత్రి, వైసిపి మాజీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కిల్లి కృపారాణి కాంగ్రెస్ పార్టీలో చేరిక అనంతరం ఎంపీ, టెక్కలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల పేర్లు సందిగ్ధంలో పడ్డాయి. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ మొదటి జాబితా విడుదల చేసిన నేపథ్యంలో జిల్లా నుంచి ఏడుగురు అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. వీటిలో టెక్కలి నియోజకవర్గం, జిల్లా ఎంపీ స్థానం అభ్యర్థిత్వం పెండింగ్‌లో పెటారు. అయితే కృపారాణి కాంగ్రెస్ పార్టీలో చేరుతారని ఈ మేరకు ఈ రెండు స్థానాలు ఖాళీగా ఉంచడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం డిసిసికి సూచనప్రాయంగా తెలియజేసింది. అయితే కృపారాణి కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటికీ ఇప్పటివరకు అభ్యర్థుల పేర్లు ఖరారుకావడంలో సందిగ్ధం నెలకొంది. సొంత పార్టీకి చేరుకున్న కృపారాణి జిల్లా ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తారా? లేక టెక్కలి నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తారా? అన్నది స్పష్టం కాలేదు. ఈమె నిర్ణయం మేరకే ఈ రెండు స్థానాలు భర్తీ కానున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎంపీగా డిసిసి అధ్యక్షులు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు పోటీకి సుముఖత వ్యక్తం చేశారు. ఈ స్థానాన్ని కృపారాణి ఆశిస్తే డిసిసి అధ్యక్షులు టెక్కలి నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు సమాచారం. టెక్కలి నియోజకవర్గ అభ్యర్థిగా కృపారాణి పోటీ చేస్తే డిసిసి అధ్యక్షులు ఎంపీగా పోటీ చేయనున్నట్లు తెలుస్తుంది. ఈ మేరకు కృపారాణి అభ్యర్థిత్వం మేరకు పార్టీ తీసుకునే నిర్ణయంపై ఈ స్థానాలు భర్తీ కానున్నాయి. ఇదిలా ఉండగా వైసిపిలోని ఒక గ్రూప్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం వద్ద తమ పలుకుబడిని ఉపయోగించి కృపారాణిని పార్టీలోకి పంపించినట్లు తెలుస్తుంది. ఇదేగాని వాస్తవం అయితే ప్రస్తుతం ఉన్న వైసిపిలో గ్రూపుల పోరుకు చరమగీతం పాడవచ్చునని వారు ఆశించినట్లు తెలుస్తుంది.



మేత మేస్తున్న పశువులు

పశువుల్లో ఆరోగ్య సంరక్షణ

ప్రజాశక్తి- రణస్థలం

ఎండాకాలంలో అధిక ఉష్ణోగ్రత వలన పశువులు వడదెబ్బకు గురవుతుంటాయి. దీంతో పశువుల్లో శరీర ఉష్ణోగ్రత పెరగడం, చెమట ఎక్కువగా బయటకి రావడం, దాహం అధికంగా పెరగడం, మేత సరిగా మేయకపోవడం, శ్వాస కష్టంగా ఉండటాన్ని పాడిపశువుల్లో గమనించవచ్చు. వెంటనే వడదెబ్బకు గురైన పశువులను గుర్తించి వెంటనే చికిత్స చేయించాలి. వాటిని చల్లని ప్రదేశాల్లో మాత్రమే ఉంచాలి. తేలికగా జీర్ణమయ్యే గంజిలో ఉప్పును తగిన మోతాదులో కలిపి ఆహారంగా ఇవ్వాలని పశువైద్యులు చెబుతున్నారు. డెక్రోస్ సైలైన్ ద్రావణాన్ని రక్తనాళాలకు, విటమిన్ ఎ, డి ఇంజక్షన్లు, విటమిన్ సి, బి కాంప్లెక్స్ ఇంజక్షన్లు ఇప్పించాలి. ఎలక్ట్రోలైట్లు కలిగిన (ఎలక్ట్రో బూస్ట్ పౌడర్) ఒక లీటరు ద్రావణాన్ని అందించాలి. రోజుకు 40 లీటర్ల నీటిని తాగించాలి. ఫైటో కూల్ ద్రావణాన్ని రోజుకు 10 మిల్లీల చొప్పున తాగించాలని పశువైద్యులు చెబుతున్నారు. గాలికుంటు వ్యాధి సోకకుండా మార్చి నెలలో వ్యాధినిరోధక టీకాలను, గొంతువాపు, జబ్బ వాపు వ్యాధులు సోకకుండా ముందు జాగ్రత్తగా టీకాలను మే నెలలో ఇవ్వాలని పశువైద్యులు పాడి రైతులకు సూచిస్తున్నారు.

శ్రీక్రోధి నామ శుభాకాంక్షలు



శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ మండలంలోని గాజుల కొల్లివలస వద్ద ఉన్న సంగమయ్య కొండ దిగువన సైకత శిల్పి గేదెల హరికృష్ణ సోమవారం సైకత శిల్పం వేశారు. ఈ సైకిత శిల్పం పలువురిని ఆకట్టుకుంది. ఈ సైకత శిల్పాన్ని చూసేందుకు చుట్టుపక్కల ప్రజలు అక్కడకు చేరుకొని తిలకించారు.

– ప్రజాశక్తి, ఆమదాలవలస

రోడ్డు వేయకపోతే ఓటు వేయం



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి– నందిగాం

మండలంలోని ఉయ్యాలపేట పంచాయతీ ఉయ్యాలపేటకు రోడ్లు వేయకుంటే వచ్చే సార్వత్రిక ఎన్నికలను బహిష్కరిస్తామని గ్రామస్తులు స్పష్టం చేశారు. ఈ మేరకు గ్రామంలో కొవ్వొత్తులు చేతబట్టి సోమవారం ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు చేతబట్టి నో రోడ్డు... ఓ ఓటు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్లు లేకపోవడంతో వర్షాకాలంలో అవస్థలు పడుతున్నామని అన్నారు. అలాగే 108, 104 వాహనాలు గ్రామానికి రావడం లేదని అన్నారు. గ్రామానికి రోడ్డుతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలకూ నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మించాలని కోరుతున్నా పాలకులు స్పందించలేదని అన్నారు. కార్యక్రమంలో యువకులు, బాలబాలికలు పాల్గొన్నారు.

40 కుటుంబాలు వైసిపిలో చేరిక

ఇచ్ఛాపురం: స్థానిక రోటరీ కమ్యూనిటీ భవనంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ సమక్షంలో స్వర్ణకారుల సంఘం అధ్యక్షులు శంకార చారి ఆధ్వర్యాన 40 మంది కుటుంబాలు పార్టీలో చేరారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమని, టౌన్ పార్టీ అధ్యక్షులు బలివాడ ప్రకాష్ పట్నాయక్, టౌన్ జెసిఎస్ అధ్యక్షులు సాలిన ఢిల్లీరావు, పిలక విజయభాస్కర్, చాట్ల లోహిదాస్, సంతు, నీలాపు ఢిల్లి, బచ్చు జగన్నాథం పాల్గొన్నారు.



వైసిపి కండువా వేస్తున్న విజయ